తెలుగు యూనివర్సిటీ పేరు మార్చొద్దు

ఆర్కేపురం, సెప్టెంబర్ 24: తెలుగు యూనివర్సిటీ పేరు మార్చవద్దని ఆర్యవైశ్య సంఘం నాయకులు శేఖర్ గుప్తా కోరారు. సోమవారం ఆర్కేపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని ఆర్యవైశ్యులకు స్ఫూర్తిదాయకుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును తెలుగు యూనివర్సిటీకి మార్చడం తగదన్నారు. ఆర్యవైశ్య జాతి నాయకుడి స్ఫూర్తితో యూనివర్సిటీకి పేరు పెట్టారని, అలాంటి పేరును మార్చుతామని చెప్పి జీవో ఇవ్వడం వైశ్యుల మనోభావాలను దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. వెంటనే నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును పెట్టాలనుకుంటే నిజామాబాద్ జిల్లాలో ఉన్నటువంటి తెలంగాణ యూనివర్సిటీకి పెట్టాలని కోరారు.

ప్రశాంతంగా ఉత్సవాలు.. పోలీసులకు సన్మానం

హుండీ ఆదాయం రూ.18,06,000

బాలాపూర్ పోలీసులను సత్కరిస్తున్న బాలాపూర్ ఉత్సవ సమితి సభ్యులు

బడంగ్‌పేట, సెప్టెంబర్ 24: బాలాపూర్ గణనాథునికి భక్తులు హుండీలో వేసిన డబ్బులను లెక్కించగా రూ.18,06,000 వచ్చిన్నట్లు గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కళ్కొం నీరంజన్ రెడ్డి తెలిపారు. బాలాపూర్ గణేశ్ ఉత్సవాలకు సహకరించిన అన్ని శాఖల అధికారులకు ఉత్సవ కమిటీ తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడానికి సీఐ భూపతి, డీఐ మధు, ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డిని సన్మానించారు. ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసిన డీసీపీ సునీతా రెడ్డి, ఏసీపీ లక్ష్మి కాంత్ రెడ్డి, ట్రాఫిక్ డీసీకి కృతజ్ఞతలు తెలిపారు.

హనుమాన్ ఆలయంలో డీజీ ప్రత్యేక పూజలు

ఐపీఎస్ అధికారి డీజీ సౌమ్య మిశ్రాకు కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి శేష వస్త్రాలు అందజేస్తున్న వేదపండితులు, ఆలయ ఈవో ప్రేమ్‌కుమార్‌రావు

చంపాపేట, సెప్టెంబర్ 24: కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో ఐపీఎస్ అధికారి జైళ్లు, కరెక్షన్ సర్వీస్ శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీ) సౌమ్య మిశ్రా తన కుమారుడితో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రేమ్‌కుమార్‌రావు ఆధ్వర్యంలో వారికి మంగళ వాయిద్యాలచే పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు, అనంతరం వారు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు వారికి స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేసి ఘనంగా శాలువాతో సత్కరించి సన్మానించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలను నిరోధించండి

సీఐ అశోక్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎన్జీవోస్ కాలనీవాసులు

వనస్థలిపురం, సెప్టెంబర్ 24: ఎన్జీవోస్ కాలనీ బస్‌స్టాండ్ పరిసరాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను నిరోధించాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం సీఐ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాత్రి పూట మందుబాబులు అక్కడ మద్యం సేవిస్తున్నారన్నారు. కొంతమంది గుంపులుగా అక్కడచేరుతున్నారని తెలిపారు. పోలీసులు తగు చర్యలు తీసుకొని వాటిని నిరోధించాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి సంఘటనలు జరిగినా తమకు సమాచారం ఇవ్వాలని, వెంటనే చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, శ్యామ్, రాఘవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

కొత్తపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉస్మానియా డెంటల్ కళాశాల సహకారంతో నిర్వహించిన ఉచిత దంత వైద్య పరీక్షా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా

ఎల్బీనగర్, సెప్టెంబర్ 24: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా తెలిపారు. మంగళవారం కొత్తపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తపేట, బంజారా పెరల్స్ ఆధ్వర్యంలో ఉస్మానియా డెంటల్ కళాశాల సౌజన్యంతో ఉచిత దంత పరీక్షలు, అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో తరుచుగా వైద్య పరీక్షలను నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. కొత్తపేట ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల అభివృద్ధికి తన వంతుగా సహకారం అందించానని, భవిష్యత్తులోనూ కొనసాగిస్తామన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ విజయరంగ మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం లయన్స్ క్లబ్ తరపున దంత పరీక్షలు నిర్వహించడంతో పాటు వారికి దంత సంరక్షణ పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయేందర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ కొత్తపేట అధ్యక్షుడు కర్ణ శ్రీనివాస్‌రావు, లయన్స్ ప్రతినిధులు కొట్టం జంగయ్య యాదవ్, సునీతా రెడ్డి, కొయిగూర రమేశ్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన అధికారులు

బడంగ్‌పేట, సెప్టెంబర్ 24: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కమిషనర్ రఘుకుమార్ ఆదేశాల మేరకు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 1వ డివిజన్ కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని.. సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్పమత్తంగా ఉండాలని సూచించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గాయిత్రి, డాక్టర్ సునీత, రాజేందర్ తదితరులు ఉన్నారు.

వైద పరీక్షలు.. మందులు పంపిణీ

కందుకూరు గ్రామ పంచాయతీలో జరిగిన వైద్య పరీక్షల పాల్గొన్న సరిత

కందుకూరు, సెప్టెంబర్ 24: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎండీవో సరిత తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా కందుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయంతో పాటు ప్రభుత్వ కస్తూర్బా బాలికల పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలతో పాటు పరిసరాలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ భార్గవి, ఎంపీఓ గీత, ఏపీఓ రవీందర్‌రెడ్డి, పంచాయతీల కార్యదర్శులు సురేందర్ గౌడ్, ఉమాదేవి, ఏఎన్ఎం అర్చన, ఆశావర్కర్ చీమల అనిత, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

పోషన్ మాసం కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నారాయణమ్మ

బడంగ్‌పేట, సెప్టెంబర్ 24: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ బి.నారాయణమ్మ తెలిపారు. పోషన మాసోత్సవాల సందర్భంగా భగత్‌సింగ్ నగర్ సెక్టర్ ఆధ్వర్యంలో న్యూట్రీషన్ ఫుడ్ గురించి కిషోర బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు ఒక్క పూట భోజనంతో పాటు పాలు, గుడ్లు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోషన్ స్టాఫ్ యాదగిరి, శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు బిరుదు యశోధ, రేణుక, అనంత, పద్మశ్రీ, మంగ, అనిత, సునీత, శోభ, శ్రీలత, యాదమ్మ, వరలక్ష్మి, నిర్మల, శోభ, తదితరులు ఉన్నారు.

సౌత్‌ఎండ్ పార్కు కాలనీలోకి వరదనీరు చేరిన దృశ్యం

ఎరుకల నాంచారమ్మకాలనీ నుంచి ఆనంద్‌నగర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుపైకి చేరిన వరదనీటిలో ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులు

వర్షం.. వరద

బండ్లగూడ శ్రావణశ్రీ ఎన్‌క్లేవ్‌లో మోకాలి లోతు వరదనీటిలో ఇంటికి చేరుతున్న కాలనీవాసి

బండ్లగూడ శ్రీనివాసకాలనీలో వరదనీరు చేరిన దృశ్యం

ప్రెస్‌కాలనీలో వరద నీరు చేరిన దృశ్యం

ఇబ్బందులు పడుతున్న బాధితులు

- దంచికొట్టిన వాన.. రోడ్లన్నీ జలమయం
- ఉప్పొంగిన నాలాలు, మ్యాన్‌హోళ్లు
- స్తంభించిన జనజీవనం.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- నేలకొరిగిన చెట్లు.. విద్యుత్ సరఫరాకు ఆటంకం
- రోడ్లు, కాలనీల్లోకి మోకాలిలోతుకు పైగా చేరిన వరదనీరు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 24: మంగళవారం సాయంత్రం రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు కురిసిన వర్షంతో కాలనీల్లోకి మోకాలి లోతు వరదనీరు చేరింది. మన్సూరాబాద్ డివిజన్ పరిధి గణేశ్‌నగర్ కాలనీ, సహారా స్టేట్స్‌కాలనీ, హిమపురికాలనీ, ఆగమయ్యనగర్, శ్రీసాయినాథ్‌కాలనీ, మల్లికార్జునన గర్, చింతలకుంట, సుష్మ సమీపంలోని ఇందిరానగర్ చౌరస్తా, నాగోల్ డివిజన్ పరిధి మన్సూరాబాద్ నుంచి ఆనంద్‌నగర్‌కు వెళ్లే మార్గం, ఆనంద్‌నగర్ చౌరస్తా, బండ్లగూడ, శ్రీనివాసకాలనీ, శ్రావణశ్రీ ఎన్‌క్లేవ్ తదితర కాలనీల్లోకి భారీగా వరదనీరు చేరింది. దీంతో కాలనీల్లోకి రాకపోకలు స్తంభించిపోయాయి. విజయవాడ జాతీయ రహదారిపై వరదనీరు చేరడంతో గంటల తరబడిగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పాటు లోతట్టు ప్రాంతమైన అయ్యప్పకాలనీలోని పలు ఇండ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. వర్షం ఆగకపోవడంతో జీహెచ్ఎంసీ అధికారుల సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్

రెవెన్యూ మైనార్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కందుకూరు, సెప్టెంబర్ 24 : రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ మైనార్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్ రాష్ట్ర మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోషియేషన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్ తెలిపారు. జిల్లా జనరల్ బాడిలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. పీఆర్‌సీ 2024, రెగ్యూలర్ పింఛన్ స్కీమ్ నుంచి సీపీఎస్, హెల్త్ కార్డులు, హౌజింగ్ పాట్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ మొయినుద్దీన్, అహమ్మద్, అయూబ్, చాన్ పాష, షరీఫ్ ముస్లిం రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వినతి

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి వినతిపత్రం సమర్పిస్తున్న బీసీ ప్రతినిధులు

మన్సూరాబాద్, సెప్టెంబర్ 24: కామారెడ్డి డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ప్రతినిధులు, సోషల్ జస్టిస్ పార్టీ నేతలు మంగళవారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో కులగణన అంశంపై మాట్లాడుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆ ప్రక్రియను తక్షణమే అమలు చేయాలని కోరారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరిట ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదేశించాలని కోరారు. బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కోరినట్లు బీసీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు, ప్రతినిధులు ఇనుకొండ తిరుమలి, చామకూర రాజు, కేవీ గౌడ్, కిరణ్‌కుమార్‌గౌడ్, దాసరి కిరణ్, ఒంటెద్దు నరేందర్, సంగెం సూర్యారావు, అవ్వార వేణు, బత్తిని కీర్తిలత గౌడ్, గౌలికర్ నర్సింగ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈడీ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 24 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎం ఈడీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పా రు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

రంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ చైర్మన్‌గా భిక్షపతి గౌడ్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబర్24(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ చైర్మన్‌గా హయత్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భిక్షపతిగౌడ్‌ను నియమిస్తూ జారీ చేసిన ఉత్తుర్వులను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేతుల మీదుగా అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, ప్రచార కమిటీ అధ్యక్షుడు మధుయాష్కీగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేతుల మీదుగా నియామాక పత్రాన్ని అందుకుంటున్న భిక్షపతి గౌడ్

పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను కలిసిన నాయకులు

వనస్థలిపురం, సెప్టెంబర్ 24: రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను పలువురు కాంగ్రెస్ నేతలు మంగళవారం ఆయన నివాసంలో కలిశారు. పార్టీ సీనియర్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ మహేశ్‌గౌడ్‌ను కలిసి సన్మానించారు. పీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్ను శ్రీకాంత్‌రెడ్డి ఆయన అనుచరులతోపాటు అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ నాయకుడు ఉమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రక్తహీనతకు సంబంధించిన అవగాహన పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న ఆయుష్ ప్రతినిధులు

ఆయుర్వేదంతో రక్తహీనత దూరం

సైదాబాద్, సెప్టెంబర్ 24: సైదాబాద్ డివిజన్ పరిధిలోని బ్యాంక్ కాలనీ మార్నింగ్ స్టార్ స్కూల్‌లో కేంద్రియ ఆయుర్వేద విజ్ఞాన పరిశోధన పరిషత్ (ఆయుష్) ఆధ్వర్యంలో 7వ, రాష్ట్రీయ పోషణ్ మాహ్-2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలోని ఎనిమిది, తొమ్మిదో తరగతులకు చెందిన విద్యార్థులకు పోషకాహారం, ఆయుర్వేదంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ సీనియర్ పరిశోధకులు డాక్టర్ వైరముత్తు, డాక్టర్ కె.భార్గవి మాట్లాడుతూ.. విద్యార్థులు రక్తలేమి(రక్తహీనత) బారిన పడుకుండా మంచి ఆహారం తీసుకోవాలన్నారు. విద్యార్థులు చదువు, మైరుగైన ఆరోగ్యం కొరకు సాంకేతిక పరిజ్ఞానం, జీవన శైలి పద్ధతులను విద్యార్థులంతా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.శ్రీనివాసరావు, పాఠశాల కరస్పాండెంట్ గీతా, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యవస్థాపక దినోత్సవాలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ, అధ్యాపకులు

హయత్‌నగర్, సెప్టెంబర్ 24: హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ అధ్యక్షతన కళాశాల కామర్స్ అధ్యక్షుడు, పూర్వ విద్యార్థుల సంఘం సమన్వయకర్త డాక్టర్ శివపురం సబ్రహ్మణ్యం సహకారంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న రోజుల్లోని కళాశాల జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కళాశాల ద్వారా తాము లబ్ధి పొంది ఉద్యోగులుగా, పరిశోధనకులుగా ఎలా అవకాశాలను సంపాదించుకున్న ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, రంగోలి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.